పట్టాల పంపిణీతో 70 ఏళ్ల కల సాకారం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్


ఇబ్రహీంపట్నంలో లంకభూముల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్

ఇబ్రహీంపట్నం: బ్రిటిష్ కాలం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీలు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్న సన్నచిన్నకారు రైతులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలు ఇచ్చి 70 ఏళ్ల నాటి కల సాకారం చేశారని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి ఎమ్మెల్యే సోమవారం పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని లంకభూములు సబ్ డివిజన్ చేసి వ్యక్తిగతంగా పట్టాలు ఇచ్చి భూమిపై శాశ్వత హక్కులు కల్పించారన్నారు. ప్రభుత్వం జీఓ విడుదల చేసిన వెంటనే కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, సబ్‌కలెక్టర్ అదితిసింగ్ సహకారంతో పారదర్శకంగా పనులు వేగవంతం చేయించామన్నారు. ఇప్పటి వరకు లంకభూములపై మీకు ఎటువంటి ఆధారం లేదని పట్టాల పంపిణీతో ప్రభుత్వం సంపూర్ణ హక్కు కల్పించిందన్నారు. రాజకీయ, కుల మత వర్గాల జోలికి పోకుండా ప్రతి సభ్యుడికీ వ్యక్తిగత పట్టా ఇచ్చామని తెలిపారు. కోర్టు వివాదాల పరిధిలో ఉన్న సొసైటీల సభ్యులకు కూడా పట్టాలు మంజూరు అయ్యాయని, వివాదాలు పరిష్కారం అయిన పిమ్మట పట్టాలు అందజేస్తామన్నారు. సబ్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ తరతరాలుగా రైతుల ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాలు సదినియోగం చేసుకోవాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలో ఐదు గ్రామాల్లో 19 సొసైటీలకు గాను 793.27 ఎకరాల్లో 1,209 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, నాయకులు లంకే అంకమోహనరావు, ఎన్.దయాకర్, చింకా శ్రీనివాసరావు, గుంజా శ్రీనివాసరావు, శివశంకరరావు, శరభయ్య, బాణావత్ నాగ బాలమ్మ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ లబ్ధి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


నూజివీడులో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ ఇంటింటికీ వెళ్లి ఏయే పథకాల కింద ఎంతెంత లబ్ధి పొందారో స్థానికులకు వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోతే వారి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతి పథకం చారిత్రాత్మకమేనని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాలన్నారు. చంద్రబాబు మాటలు నమ్మితే ఇప్పుడు అమలవుతున్న పథకాలేవీ ఉండబోవని, టీడీపీ వాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, నాయకుడు యార్లగడ్డ చంటి, 9వ వార్డు కౌన్సిలర్ మీర్ అంజాద్ ఆలీ, షేక్ మస్తాన్‌వలీ, ఆదపురెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిరువ్యాపారులపై భారం ఉండబోదు

ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్


కొండపల్లి మున్సిపాల్టీ చిరువ్యాపారుల ఆశీలు తానే చెల్లిస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే వసంత

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీలో చిరువ్యాపారులకు భారంగా మారిన ఆశీలు తానే భరిస్తానని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతితో మున్సిపాల్టీలో అమలు చేస్తున్న ఆశీలు వసూళ్లు తొలి నుంచి వివాదాస్పదంగా మారడంతో వాటిని రద్దు చేసినట్లు లంక భూముల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రకటించారు. అయితే ఆశీలు ద్వారా ఏడాదికి రూ.12లక్షలు ప్రభుత్వానికి జమచేయాల్సి ఉన్నందున వాటిని వ్యక్తిగతంగా తానే భరిస్తానన్నారు. చిరువ్యాపారుల నుంచి ఆశీలు వసూలు వెంటనే విరమించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు.

కనువిందుగా దీపోత్సవం


చాట్రాయిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


గంపలగూడెం శివాలయంలో దీపోత్సవం

గంపలగూడెం: కార్తికమాసం సందర్భంగా గంపలగూడెం గంగా పార్వతీభ్రమరాంబ సహిత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి శివరామలింగ ప్రసాద్ ఆధ్వర్యంలో ముందుగా స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్ధనారీశ్వరుడు, శివలింగాకారం, స్వస్తిక్, ఓం, త్రిశూలం ఆకారంలో రంగులు దిద్ది వాటిపై ప్రమిదలు ఉంచి ఒత్తులు వేసి వెలిగించారు. దీపపు కాంతులతో ఆలయం చూడముచ్చట గొల్పింది. ఆయా కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన పూజలు నిర్వహించారు.

తిరువూరులో..

తిరువూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తిక మాస చివరి సోమవారం సందర్భంగా దీపోత్సవం నిర్వహించారు. స్వామి అయ్యప్ప సహిత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో, పీటీకొత్తూరు రామాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయాలలో లింగాకారంలో దీపాలు వెలిగించి మహిళలు పూజాదికాలు నిర్వహించారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సత్రం సెంటర్లో గల గంగా అన్నపూర్ణ సమేత మల్లికార్జునుడికి అన్నాభిషేకం, సహస్ర దీపాలంకరణ, ఓంకారం, భక్తుల ఆధ్వర్యంలో జరిపారు.

ఘనంగా సహస్ర దీప లింగార్చన

చాట్రాయి: కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని చాట్రాయి, తుమ్మగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం సహస్ర దీప లింగార్చన చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయాల్లో రంగు రంగుల పూలతో ఓం నమఃశివాయ ఆకారంలో అలంకరించారు. దీపాలు వెలిగించి స్వామికి పూజలు నిర్వహించారు.

కరాటేలో స్వర్ణపతకాలు సాధించిన చిన్నారులు



తిరువూరు: నందిగామలో చైనీస్ కుంగ్‌ఫూ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో తిరువూరు హర్షా ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఆరు స్వర్ణపతకాలు సాధించారు. కరాటేలో ప్రతిభ సాధించిన నేహిత్, హర్షిత్, చరణ్, కల్యాణ్, వెంకటసాయి, రాఘవ, గుప్తాలను, శిక్షణ ఇచ్చిన కోచ్ నాగేశ్వరరావును పలువురు అభినందించారు.

మిర్చిపైర్ల పరిశీలన



ఎ్రరమాడు(తిరువూరురూరల్): మండలంలోని ఎ్రరమాడులో తుపాను కారణంగా నష్టపోయిన మిర్చిపైర్లను ఉద్యానవన అధికారులు సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలకనుగుణంగా పంట నష్టం నమోదు చేస్తామని రైతులకు తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని గ్రామ సర్పంచ్ బొర్రా మాధవి, వైఎస్సార్ సీపీ నాయకుడు మోహనరావు కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన


ముసునూరు మండలం వలసపల్లిలో డిస్‌ప్లే బోర్డు ప్రారంభంలో నాయకులు


చాట్రాయి మండలంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

తాతకుంట్ల (విస్సన్నపేట): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, జేసీఎస్ మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ అన్నారు. మండలంలోని తాతకుంట్ల సచివాలయం వద్ద పల్లెకు పోదాం, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సచివాలయం పరిధిలో చేసిన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి డిస్‌ప్లే బోర్డును గ్రామ సర్పంచ్ పి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మేడా తిరుపతిరావు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పార్టీ దిమ్మ వద్ద వైఎస్సార్ సీపీ జెండాను జేసీఎస్ మండల కన్వీనర్ ఆవిష్కరించారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు షేక్ కాలీషా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

వాముకుంట్ల(తిరువూరురూరల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన సాధ్యమవుతోందని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. మండలంలోని వాముకుంట్లలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. వాముకుంట్లలో నాలుగున్నరేళ్లలో సుమారు రూ.4కోట్లకు పైగా నిధులు సంక్షేమ పథకాల కింద ప్రజలకందాయన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు గోపిరెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గాదెవారిగూడెం(గంపలగూడెం): అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం రాత్రి గంపలగూడెం మండలం ఊటుకూరు సచివాలయం పరిధిలోని గాదెవారిగూడెంలో పల్లెకుపోదాం, వైఎస్సార్ సీపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. పథకాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఎంపీటీసీ సభ్యురాలు జొన్నలగడ్డ మేరీశాంతి ఆవిష్కరించారు. కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను వెంకటేశ్వరరావు ఎగురవేశారు. మాజీ ఎంపీపీ కోట దాసు, నాయకులు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నరసారెడ్డి పాల్గొన్నారు.


విస్సన్నపేట మండలం తాతకుంట్లలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

ఆగిరిపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు తెలిపారు. సోమవారం ఈదర-1లో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాల తెలియజేసే బోర్డును ఆవిష్కరించారు. ఆడుదాం ఆంధ్ర కిట్లను క్రీడాకారులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నరసింహారావు, జిల్లా కార్యదర్శి హరిబాబు, పెద్ద సత్యంబాబు, సర్పంచ్ అనిత, సీతారాంపురం సర్పంచ్ మురళి, భాస్కర్‌ప్రసాదు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: పల్లె సీమల సమగ్ర ప్రగతి జగనన్న సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యం అని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా సోమవారం వలసపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ దామోదర్ అధ్యక్షతన పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు డి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం


వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెనుగొలను(గంపలగూడెం): ధర్మ ప్రచారంలో భాగంగా నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గంపలగూడెం మండలం పెనుగొలను రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. నెమలి దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పెనుగొలను రంగనాయక స్వామి గుడి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంచే స్వామికి విశేషపూజ నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



నూజివీడు: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో బ్రదర్ బండి ఐజాక్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బండి శ్యామ్, పలువురు చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: ఈదరలో గ్రేస్ గ్రాస్పెల్ చర్చి నందు పాస్టర్ శ్యామ్ నోయల్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. క్రిస్మస్ తాత వేషం పలువురిని ఆకట్టుకుంది.

ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలి


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐకమత్యంగా ఉండాలని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు, పీఏసీఎస్ చైర్మన్ వేములకొండ రాంబాబు, వేములకొండ రామారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తిక మాస అన్నసమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

చాట్రాయి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా దేశిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, జగన్‌మోహనరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ముసునూరు మండలంలో రామలింగేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

ముసునూరు: బలివేలోని రామలింగేశ్వరస్వామికి సోమవారం రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్తిక మాసం మలి సోమవారం కావడంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా బలివేలోని రామలింగేశ్వరస్వామికి ఏలూరు వర్తక సంఘ ప్రతినిధులు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేక సహిత లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ కొండలరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రేపు జాబ్ మేళా

మైలవరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 13న ఉదయం 11 గంటలకు నిరుద్యోగ యువతకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీసీఎఫ్‌డీసీ వారి సౌజన్యంతో ఎంపికైన 40 మంది నిరుద్యోగ యువతకు ముందుగా భారత ప్రభుత్వ సంస్థ సీపెట్‌ విజయవాడ కేంద్రంలో మెషీన్ ఆపరేటర్-ప్లాస్టిక్ ప్రోసెసింగ్ అనే టెక్నికల్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థలలో ఉద్యోగావకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు సీపెట్‌ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 నుంచి 35 సంవత్సరాలు కలిగి నిరుద్యోగులు తమ విద్యార్హత, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలుతో జాబ్ మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు సాకిరి రామకృష్ణను సంప్రదించాల్సిందిగా సూచించారు.

క్లుప్తంగా

జగనన్న లేఅవుట్‌లో నేల చదును పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న లేఅవుట్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు పాలడుగు దుర్గాప్రసాద్ నేల చదును పనులు తన సొంత ఖర్చులతో సోమవారం చేపట్టారు. కాలనీలో తొలి విడత 1,515 గృహాలు నిర్మాణం చేపట్టగా రెండో విడతలో మరికొన్ని గృహాలు నిర్మించేందుకు ముళ్లపొదులు, నేల చదును చేయించారు. త్వరలో ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ ద్వారా మరోసారి భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

తిరువూరు: తుపాను కారణంగా తిరువూరు పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన వర్షపునీటి తొలగింపు, డ్రెయినేజీలలో పూడికతీత, తాత్కాలిక డ్రెయినేజీల ఏర్పాటు పనులను కమిషనర్ బాలకృష్ణ పర్యవేక్షించారు. 15వ వార్డులో ఇళ్లమధ్య నిలిచిపోయిన వర్షపునీటి తొలగింపు పనులను వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్ పరిశీలించారు.

పేదలందరికీ పథకాలు అందాలి

చంద్రాల(మైలవరం): ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలు పేదలందరికీ అందాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నూతలపాటి బాల కోటేశ్వరరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మైలవరం మండల బీజేపీ అధ్యక్షుడు తోట నాగేశ్వరావు, కృష్ణమోహన్, బీజేవైఎం యువ మోర్చా టీమ్ లీడర్ లీలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

206 మందికి కళ్లజోళ్ల పంపిణీ

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అర్హులైన 206 మందికి కళ్లజోళ్లను సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కర రెడ్డి పంపిణీ చేశారు. రెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీమ్ విజేతలకు బహుమతులు

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపో పరిధిలో ఎంపిక చేసిన బస్ రూట్లలో ఆర్టీసీ గిఫ్ట్ స్కీమ్ విజేతలను డ్రా ద్వారా నిర్ణయించారు. ఆదాయం తక్కువ కలిగిన 144ఎం, 307కె, 145, 309 రూట్లలో గతనెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన గిఫ్ట్ స్కీమ్ సోమవారం డ్రా తీసి ఎనిమిది మంది విజేతలను ఎంపిక చేశామని డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంపికైన వారికి బహుమతులు అందజేశారు.

గురుస్వాములకు సన్మానం

పెనుగొలను(గంపలగూడెం): వేదభూమి, పుణ్యభూమి అయిన భారతదేశంలో ప్రతి ఒక్కరూ భగవంతుడి మీద భక్తిని కలిగి ఉండాలని చండీ ఉపాసకులు జి. కోటేశ్వరశర్మ అన్నారు. పెనుగొలనులో సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప మందిరం వద్ద 18 సార్లు పైగా అయ్యప్ప మాలధరించి శబరిమలకు వెళ్లిన గురుస్వాములను సోమవారం సన్మానించారు.

శివుడికి లక్షదళ పూజ

తిరువూరు: కార్తిక మాసం చివరి సోమవారం నాడు తిరువూరు రామలింగేశ్వరాలయంలో స్వామికి లక్ష దళ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు భవాని రాధాకృష్ణ, రాముల ఆధ్వర్యంలో భక్తులు మారేడు దళాలు, తులసీదళాలతో స్వామిని పూజించారు. పంచామృతాలతో అభిషేకం, అర్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవాహినీలో వీక్షిత్ భారత్

తిరువూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీక్షిత్ భారత్ 2047 కార్యక్రమంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రత్యక్ష ప్రసారం చేశారు. సామాజిక అభివృద్ధిలో ప్రతి విద్యార్థి భాగస్వాములు కావాలని, 2047 నాటికి భారతదేశాన్ని అగ్రదేశాల సరసన నిలపడానికి యువత కృషి చేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ఏఓ కిషోర్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ముసునూరు: శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. మండలంలోని రమణక్కపేట, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి, లోపూడి, వలసపల్లి, చింతలవల్లిల్లో సోమవారం ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో ఎంపికైన గ్రామ సచివాలయ స్థాయి క్రీడాకారులకు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ కిట్లను నేతలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీలు రాజానారాయన, గంగాధర్, సర్పంచ్‌లు రంగు ధనలక్ష్మి, పేరం కృష్ణ, దామోదర్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

ఆగిరిపల్లి: ఎస్సై చంటిబాబు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నెక్కలం గొల్లగూడెం, వట్టిగుడుపాడులోని పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. రూ.34,150 స్వాధీనం చేసుకుని, 21 మందిపై కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నూజివీడు: పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న దుర్గామల్లేశ్వరస్వామిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం దర్శించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు రంజిత్‌రెడ్డి, వినయ్, రామకృష్ణ, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సన్మానం

ఊటుకూరు(గంపలగూడెం): కార్తికమాసం సందర్భంగా గంపలగూడెం మండలం ఊటుకూరులో కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఆ సామాజిక వర్గానికి చెందిన 20 మంది సీనియర్ సిటిజనులకు శాలువా కప్పి సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, సీఈఓ వెంకటనరసయ్య, నాయకులు మాధవరావు, ముత్తయ్య, కృష్ణారావు, నరసింహారావు, డీఎస్‌ఆర్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

చాట్రాయి: నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య సహకారంతో మండలంలోని పోతనపల్లి తూర్పు తండాలో సోమవారం క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు పరికరాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చాట్రాయి: క్రీడాకారులను దాతలు ప్రోత్సహించాలని మర్లపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎ.బక్కయ్య కోరారు. సోమవారం పోలవరం గ్రామానికి చెందిన దాత చల్లారి మహేష్ రూ.10 వేల విలువైన క్రీడా దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతల బంధువులు రవి, రమేష్, పీఈటీ సతీష్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

చాట్రాయి: మండలంలోని చనుబండ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

అంతర్ కళాశాలల బాక్సింగ్ సెలక్షన్స్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ జోన్ అంతర్ కళాశాలల బాక్సింగ్ సెలక్షన్స్ జరిగాయి. వివిధ జిల్లాల నుంచి 30 మంది క్రీడాకారులు పాల్గొన్న సెలక్షన్స్ జేఎన్టీయూ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడు రాజు సోమవారం పోటీలు ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్స్ అందజేత

ఆగిరిపల్లి: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు ఎంఈఓ-1 సర్వేశ్వరరావు ట్యాబ్స్ అందజేశారు. ఆగిరిపల్లిలో ఎంపీపీ పాఠశాలలో గల భవిత కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఒలంపిక్ గేమ్స్‌లోని విజేతలకు ఎంఈఓ-2 ఆనంద్ కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. హెచ్‌ఎం విజయదుర్గ, ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతి పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ డీఎం

తిరువూరు: ఈ నెల 13న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తిరువూరు ఆర్టీసీ డీఎం వేణు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 99592 25465కు ప్రయాణికులు తమ సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో నేడు

ఇబ్రహీంపట్నం: ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం ఎ.సుబ్రహ్మణం తెలిపారు. 99592 25457కు ఫోన్ చేసి సూచనలు ఇవ్వాలని కోరారు.